క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటాం



భరత్‌ను పరామర్శిస్తున్న మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: నిరుపేద ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు తాము అండగా నిలుస్తామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలం బంగ్రంపల్లి గ్రామ ఉప సర్పంచ్ భరత్ అనారోగ్యంతో నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఆసుపత్రికి వెళ్లి భరత్‌ను పరామర్శించారు.

చైర్‌పర్సన్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

దౌల్తాబాద్: కొడంగల్ మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన బి.సుజాత, డైరెక్టర్లు భానుప్రకాష్, కౌసల్య, రామకృష్ణారెడ్డి, వినయ్ కుమార్‌లను సోమవారం బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలానికి చెందిన సుజాతరెడ్డి చైర్‌పర్సన్‌గా ఎన్నికకావడం సంతోష కరమని, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్ కుమార్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ జాకీర్‌అలీ, సర్పంచ్ శిరీష, పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రావు, నరోత్తంరెడ్డి, తదితరులున్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



నీటితో అభిషేకం చేస్తున్న భక్తులు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం మరికల్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం అంతంపల్లిలో సోమవారం బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ధ్వజస్తంభానికి నీటితో అభిషేకం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ పాండురంగయ్య, ఎంపీటీసీ సత్యకుమార్, కృష్ణమోహన్ శర్మ, నాయకులు వెంకటేశ్, జహంగీర్, శ్రీనివాసులు, గోపాల్, రాజేష్, యాదయ్య పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం



డాక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ అరవింద్‌రావు

పరిగి: పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తీరుపై ఎంపీపీ అరవింద్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిగి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మృతదేహాన్ని చూసేందుకు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ రోగులను ఎవరూ పట్టించుకోకపోవడంపై గమనించి వైద్య సిబ్బందిని ప్రశ్నించగా.. ఎవరూ సమాధానం ఇవ్వలేదు. డ్యూటీ డాక్టర్‌ను వివరణ కోరగా.. ఆమె దురుసుగా మాట్లాడినట్లు తెలిసింది. దీంతో వైద్య సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల పనితీరుపై జిల్లా వైద్యాధికారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

కార్మికులు మొక్కలు నాటాలి

తాండూరు రూరల్: ప్రతీ కార్మికుడు తనవంతుగా మొక్కలు నాటాలని సీసీఐ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ మహేశ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలుష్య నియంత్రణను నివారించేందుకు మొక్కలు నాటాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 171 కేసులు పరిష్కారం

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీస్ పెండింగ్ కేసులపై నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో 171 కేసులు పరిష్కారమయ్యాయని రిటైర్డు సీనియర్ సివిల్‌జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో సోమవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాల్లో నమోదైన కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు.

తీరిన కరెంటు కష్టాలు

‘ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు ఉంటే వార్త. ఇప్పుడు పోతే వార్త. దేశంలో పవర్ హాలిడే పాటిస్తున్నా రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్ సరఫరా చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాం’ అని ఎమ్మెల్యేలు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన విద్యుత్ ప్రగతి కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. ‘ప్రత్యేక తెలంగాణ వస్తే ఇక్కడ అంధకారం నెలకొంటుందన్న నాటి పరాయి పాలకులకు.. నిరంతర విద్యుత్ కాంతులతో సీఎం కేసీఆర్ దీటైన జవాబు ఇచ్చారు’ అని చెప్పారు.



కొడంగల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

> విద్యుత్ కాంతులను విరజిమ్ముతున్న తెలంగాణ
> - నిరంతరాయంగా సరఫరా
> - కుల వృత్తులు, రైతులకు ఉచిత కరెంటు
> - దశాబ్ది ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు

కొడంగల్: నాటి కరెంటు కష్టాలు నేడు లేవని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ ప్రగతి విజయోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు లేక రైతులు గోస పడ్డారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోందని చెప్పారు. డీఆర్‌డీఓ కృష్ణన్, కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీలు అరుణ దేశు, మహిపాల్, ప్రకాశ్‌రెడ్డి, ఏఎమ్‌సీ వైస్ చైర్ పర్సన్ వాణిశ్రీ, ట్రాన్స్‌కో ఏడీఈ నవీన్‌కుమార్, ఎంపీడీఓ పాండు, పీఏసీఎస్ చైర్మన్లు శివకుమార్ గుప్తా, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ హేమీబాయి, మండలాల ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

సాగుకు నిరంతరం..

దౌల్తాబాద్: సాగుకు నిరంతరం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. గోకఫసల్‌వాద్ గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. సబ్‌స్టేషన్ పూర్తయితే సుమారు 10 గ్రామాలకు కరెంట్ కష్టాలు తీరనున్నాయన్నారు.

ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, సర్పంచ్ బసమ్మ, ఎంపీటీసీ కేశవరెడ్డి, ఏడీఈ నవీన్ కుమార్, ఏఈ మహిపాల్ ఉన్నారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం

బొంరాస్‌పేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ దినోత్సవం ఘనంగా జరిగింది. బురాన్‌పూర్‌లో నూతనంగా రూ.2.22కోట్లతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సబ్‌స్టేషన్ వినియోగంలోకి రావడంతో ఇక్కడ కరెంటు సమస్య తీరిందని చెప్పారు. జెడ్పీటీసీ అరుణదేశు, ఎంపీపీ హేమీబాయి, పార్టీ మండల నాయకులు శేరినారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కోట్ల యాదగిరి, దేశ్యానాయక్, రామునాయక్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ అభినందనీయం

దోమ: కుల వృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ పంపిణీ చేయడం అభినందనీయమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి తెలిపారు. దోమ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగదారులతో విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను గుర్తించి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రోజంతా విద్యుత్

పరిగి: రాష్ట్రంలో నిరంతరం విద్యుత్ సరఫరా అవుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ కేంద్రంలో విద్యుత్ ప్రగతి విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ కోసం రైతులు పొలాల వద్ద నిరీక్షించేవారని, కాని నేడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా..

తాండూరు టౌన్: 24 గంటల కరెంటు సరఫరాతో రాష్ట్రం విద్యుత్ కాంతులను విరజిమ్ముతోందని ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన విద్యుత్ ప్రగతి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై.. కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ఒకప్పుడు కరెంటు ఉంటే వార్త, ఇప్పుడు పోతే వార్త అన్నారు. దేశంలో పవర్ హాలిడే పాటిస్తున్నా.. రాష్ట్రంలో మాత్రం రోజంతా సరఫరా చేసి అందరికీ ఆదర్శంగా నిలిచామన్నారు.



పరిగి: విద్యుత్ విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు



తాండూరు టౌన్: జాతీయ జెండా ఆవిష్కరించి గీతాలాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నాయకులు

కంకల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి



దీక్షలో మండల సాధన సమితి సభ్యులు

పూడూరు: అన్ని అర్హతలున్న కంకల్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కంకల్ మండల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కృషి రత్న అవార్డు గ్రహీత సీహెచ్ నర్సింహ్మా, పరిగి జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్, బీజేపీ జిల్లా నాయకులు వెంకటయ్య, నాయకులు అజయ్, నరేష్, జంగయ్య, పోచయ్య, వీరేష్, నిఖిల్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమం విస్మరించిన ప్రభుత్వం

బంట్వారం: రైతుల పాలిట శాపంగా మారిన ధరణి సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గీత సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓ పక్క రైతు సంక్షేమాన్ని విస్మరిస్తూనే.. మరో పక్క రైతు వేదికల వద్ద సంబురాలు జరపడం హాస్యాస్పదంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. తెలంగాణలో కొత్తగా ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. 20 రోజుల పాటు ప్రచార ఆర్భాటం తప్ప.. ప్రజలకు ఒరిగేదేమీ లేదని విమర్శించారు. వేడుకలు కాస్త ఎన్నికల సభలను తలపిస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి ఉంటే సత్వరమే ధరణి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనియెడలా అన్నదాతలకు అండగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఆమె హెచ్చరించారు.

తడిసిన ధాన్యం కొంటాం

> రైతులు ఆందోళన చెందవద్దు: తహసీల్దార్

తాండూరు రూరల్: వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొంటామని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు అన్నారు. సోమవారం చెంగోల్, గోనూర్, డీసీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు కొంటామని చెప్పారు. మిల్లుల వద్ద ధాన్యం లారీలు పెద్ద ఎత్తున నిలిచిపోవడం వలన.. కేంద్రాల వద్ద అలాగే ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో మిల్లులకు తరలిస్తామని చెప్పారు. ఆర్ఐలు రాజురెడ్డి, బాలరాజ్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఎల్లప్ప ఉన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

కుల్కచర్ల: రైతులను ఇబ్బందికి గురిచేయవద్దని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. ముజాహిద్‌పూర్ వరి కొనుగోలు కేంద్రం, రైస్‌మిల్‌ను సందర్శించి మాట్లాడారు. రైతుల నుంచి ధాన్యాన్ని త్వరితగతిన సేకరించి, వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆదివారం సాల్వీడు గ్రామంలో పిడుగుపాటుకు మృత్యువాత పడిన మేకలు, గొర్రెలు, పశువుల కళేబరాలను పరిశీలించి మాట్లాడారు. రైతుల ఇబ్బందిని, వారి ఆర్థిక నష్టం గురించి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.



తాండూరు రూరల్: చెంగోల్‌లో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

అందరూ రక్తదానం చేయాలి

తాండూరు రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యం అని మల్కాపూర్ సర్పంచ్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మల్కాపూర్‌లో మాజీ ఉప సర్పంచ్ హసేన్ పటేల్ యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ మాట్లాడుతూ.. మనుషుల్లో మానవత్వాన్ని చాటేందుకు అందరూ రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం సర్పంచ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి గుర్తింపుకార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రఘునాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్(ఆర్‌సీ), ఉప సర్పంచ్ అబ్దుల్ మాజిద్, నాయకులు రాములు, సతీష్ పాటిల్, పండరిచారి, మైనొద్దీన్, రాష్ట్రపతి, బాబు అహ్మద్, శేఖర్‌గౌడ్, హర్షద్, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

> - ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
> - బడిబాట కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగిన ఎమ్మెల్యే



పరిగి: చిన్నారులను తిరిగి బడిలో చేర్పిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మిట్టకోడూర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్కారు బడుల్లో అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చుతుందని, విద్యార్థులకు పుస్తకాలతో పాటు బట్టలు, మధ్యాహ్న భోజనం వడ్డిస్తుందని తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు విద్యా ప్రమాణాలు చాలా పెరిగాయని, కావున గ్రామీణ ప్రాంత చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని సూచించారు. ఉపాధ్యాయులు గ్రామంలో గడపగడపకూ తిరిగి పాఠశాలల పనితీరును ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఎంపీపీ అరవింద్‌రావు, మండల విద్యాధికారి హరిశ్చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా..

కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మిట్టకోడూర్ గ్రామానికి చెందిన కార్యకర్త కాకి ప్రభు ఇటీవల మృతి చెందగా.. పార్టీ బీమా రూ.2 లక్షల చెక్కును మృతుడి భార్య సుమిత్రకు ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. ప్రభు కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఎంపీపీ అరవింద్‌రావు, పార్టీ సీనియర్ నాయకుడు ప్రవీణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు మాణిక్యం, రవికుమార్, బాబయ్య పాల్గొన్నారు.

చిన్నారులను బడిలో చేర్పించాలి

కుల్కచర్ల: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని చెల్లాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవులా నాయక్ అన్నారు. చెల్లాపూర్‌లో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు, నాణ్యమైన విద్య అందుతుందని, చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని సూచించారు.

ముమ్మర ప్రచారం

బొంరాస్‌పేట: ఈ నెల 3నుంచి చేపట్టిన బడిబాట కార్యక్రమంపై గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రచారం ముమ్మరం చేశారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలం బాపల్లి, డీప్లానాయక్‌తండా, పూర్యానాయక్ తండా, దుద్యాల తదితర గ్రామాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి.. స్థానికులకు అవగాహన కల్పించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నిర్బంధ విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెచ్‌ఎంలు రవీందర్‌గౌడ్, జలందర్‌రెడ్డి, గోపాల్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొడంగల్ రూరల్: బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ కల్వకోటి రాంరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని బాలికల జీసీపీఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాటలో వడ్డెర్‌గల్లీ వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నామని, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందని చెప్పారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయ సిబ్బంది అబ్దుల్ హఫ్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

> సర్పంచ్ రాంచంద్రయ్య

చేవెళ్ల: శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని గొల్లగూడ సర్పంచ్ రాంచంద్రయ్య అన్నారు. మండలంలోని గొల్లగూడలో యూత్ నాయకుడు మన్మోహన్‌గౌడ్ సహకారంతో జరుగుతున్న ప్రీమియర్ లీగ్–2023 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభ ఇలాంటి టోర్నమెంట్ల ద్వారా వెలికి తీయొచ్చన్నారు. మనోహర్, జంగయ్య, మురారి పాల్గొన్నారు.

ఉచిత విద్యకు ఎంపిక

తాండూరు రూరల్: పది ఫలితాల్లో జినుగుర్తి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి రేణుక (9.7)ఉత్తీర్ణత చాటి.. మేధా చారిటబుల్ ట్రస్ట్‌కు ఎంపికైంది. అనంతరం ట్రస్ట్ నిర్వహించిన పరీక్షలో రేణుక ఉత్తీర్ణత సాధించింది. దీంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో రేణుకకు ఇంటర్మీడియట్ నుంచి బీటెక్ వరకు ఉచితంగా చదివించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు.

పీఎంఆర్ టోర్నీ ప్రారంభం

తాండూరు టౌన్: ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని ఆయన తనయుడు రినీష్ రెడ్డి సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. క్రీడా పోటీలే కాకుండా.. రక్తదానం, వైద్య శిబిరం వంటివి నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు, అబ్దుల్ రవూఫ్, రవిగౌడ్, నీరజబాల్‌రెడ్డి, శోభారాణి, పట్లోళ్ల నర్సింహులు, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి టోర్నీ ప్రారంభిస్తున్న రినీష్ రెడ్డి

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

> - ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం
> - కాంగ్రెస్ పార్టీ నేతల నిరసన

బొంరాస్‌పేట: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సరిగా లేక అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నీటిపాలై అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శించారు. సోమవారం తుంకిమెట్ల జాతీయ రహదారి163పై బైఠాయించి ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో రాకపోకలు స్తంభించి, వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్ఐ శంకర్ కలగ జేసుకొని ధర్నా విరమింపచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నర్సింహులు గౌడ్, వెంకట్రాములు గౌడ్, రాజేశ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మల్లేశ్, నర్సింహులు నాయుడు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: ధర్నాలో కాంగ్రెస్ నేతలు

కొనుగోలు కేంద్రం వద్ద..

దౌల్తాబాద్: ధాన్యం విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు అంబేడ్కర్ చౌరస్తాలో పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు మాట్లాడుతూ.. వరిని కొనుగోలు చేయకపోవడంతో 20 రోజులుగా రైతులు సెంటర్లు, మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్రాములు, భీములు, సత్యపాల్ మాధవరెడ్డి, రాములు, దస్తప్ప, మహిపాల్, సాయిలు రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

> మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి

శంకర్‌పల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకోవాలని సూచించారు. చెట్లను నరకడం వలన పర్యావరణంలో మార్పులు వస్తాయని తెలిపారు. పచ్చని చెట్లు ఉంటేనే వర్షాలు సకాలంలో పడుతాయని చెప్పారు. వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, కౌన్సిలర్ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి..

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీరాంనగర్ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాంనగర్‌లో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంకల్ప్‌తరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్స్, ఎస్‌బీఐ సహకారంతో 33 ఎకరాల్లో 63 వేల మొక్కలు నాటే కార్యక్రమం సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులు అంతరించి పోతుండడంతోనే పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణాన్ని కాపాడాలంటే విరివిగా మొక్కలు నాటి అడవులను పెంచాలన్నారు. మొక్కలు నాటేందుకు సంకల్ప్‌తరు ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శేఖర్, హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రతినిధులు సత్యనారాయణ దూబే, సతీష్ బూర్ల, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.